కోలాహలం.. పార్వేట ఉత్సవం

నాయుడుపేటటౌన్: తుమ్మూరు గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి పార్వేట ఉత్సవాన్ని టీటీడీకి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో కోలాహలంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన సప్పరంపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి గ్రామ సమీపంలో పాఠశాల ఆవరణలో స్వామివారు వేటకు వెళ్లే ఘట్టాన్ని ప్రధాన అర్చకులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివార్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనాల్లో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర హారతులు పట్టారు. అంతకుముందు ఆలయంవద్ద స్వామివారి సప్పర ఉత్సవాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సుప్రభాతసేవ, ఆరాధన, సహస్రనామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం. రాత్రి ఊంజల్ సేవ, రాత్రి స్వామివారికి ఏకాంతసేవ పూజలను టీటీడీకి చెందిన వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

నేడు వసంతోత్సవం....

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి బుధవారం ఉదయం ఆలయం వద్ద చక్రస్నానం, వసంతోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు. రాత్రి ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.



పార్వేటకు ఊరేగింపుగా వెళుతున్న శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామి



ప్రత్యేక అలంకరణలో కరిమాణిక్యస్వామి

క్లుప్తంగా

జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పూజలు



పూజలు నిర్వహిస్తున్న నేతలు

నాయుడుపేటటౌన్: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా ప్రమాణస్వీకారం చేయాలని, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హ్యాట్రిక్ విజయం సాధించాలని కోరుతూ మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు గంధవల్లి సిద్ధయ్య పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పోలేరమ్మ ఆలయం వద్ద కౌన్సిలర్ జి. అరుణ, నేత భరత్, కలిసి పోలేరమ్మకు పూజలు చేశారు. అనంతరం 101 టెంకాయలు కొట్టారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

చిల్లకూరు: ఉపాధి పనులను మంగళవారం ఏపీఓ గిరిబాబు పరిశీలించి కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉడతావారిపాళ్లపల్లి, మన్నేగుంటలో జరుగుతున్న కమ్యూనిటీ పాండ్ పనులను ఏపీఓ తనిఖీ చేశారు. పాళ్లపల్లిలో తక్కువ మంది పనులు కూలీల ఉండడంతో సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అనంతరం తొణుకుమాల గ్రామ చెరువులో జరుగుతున్న మినీ అమృత్ సరోవర్ పనులను పరిశీలించి కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెక్నికల్ అసిస్టెంట్, ఈసీ ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ

రాపూరు: రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆర్జేడీ డాక్టర్ కళావతి పేర్కొన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలను ఆమె మంగళవారం పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే సింగిల్ మేజర్ సబ్జెక్ట్ హిస్టరీ, బీకాం కంప్యూటర్స్‌ను ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో రాపూరు, కోవూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్ హనుమంతరావు, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి



పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఐ

నాయుడుపేటటౌన్: పోలేరమ్మ జాతరలో పోలీసులు విధులను సక్రమంగా నిర్వర్తించి ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. జాతర బందోబస్తుకు డివిజన్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్‌ల నుంచి వచ్చిన పోలీసులతో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం సీఐ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 100 మందికి పైగా సిబ్బందితో పట్టణంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శిక్షణకు తప్పక హాజరుకండి

చిల్లకూరు: ఎన్నికల కౌంటింగ్ విధులు నిర్వహించే వారికి ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న క్రమంలో ప్రతిఒక్కరూ శిక్షణకు తప్పక హాజరు కావాలని తహసీల్దార్ లక్ష్మీదేవి ఆదేశించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్‌ను తిరుపతిలోని పద్మావతీ మహిళా వర్సిటీలో నిర్వహిస్తారని అన్నారు. ఇందులోభాగంగానే తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే వీఆర్వోలు, వీఆర్ఏలకు డ్యూటీలు వేశామన్నారు. డ్యూటీ వేసిన ప్రతిఒక్కరూ బుధవారం తిరుపతిలో జరిగే శిక్షణ కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని చెప్పారు. హాజరు కాకుంటే సంబంధిత సిబ్బందిపై కలెక్టర్ చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రమ్యస్వాతి, సర్వేయర్ మల్లికార్జున్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న తహసీల్దార్ లక్ష్మీదేవి

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు



చిల్లకూరు: శిక్షణ ఇస్తున్న ఎంఈఓ

కోట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మంగళవారం స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో ఎంఈఓ మస్తానయ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ప్రత్యేక శిక్షణ పొందిన రిసోర్స్‌పర్సన్ సుగుణ 65 మందికి ఈసందర్భంగా శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్న భోజనం తయారీలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వంటలు తయారు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వంటల తయారీలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నారాయణరావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

దొరవారిసత్రం: ఏకొల్లు గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ తరగతులను స్థానిక విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతిరోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. భోజనం రుచిగా, శుభ్రంగా, నాణ్యతగా ఉండాలని సూచించారు. ఎంఈఓలు మునిశేఖర్, కృష్ణయ్య, కోర్స్ డైరెక్టర్స్, సీసీహెచ్ మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

చిల్లకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ నిబంధనల మేర విద్యార్థులకు రుచికరంగా ఉండేలా చూడాలని మండల విద్యాశాఖాధికారి–2 ఎండీ రవూఫ్ నిర్వాహకులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయకులు విద్యార్థులకు మంచి ఆహారం అందివ్వాలన్నారు. రిసోర్స్ పర్సన్ వాసుదేవరావు, వైవీ రమణయ్య పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి ఏకాంత సేవ

గూడూరురూరల్: పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి లక్ష తులసి అర్చన చేసిన తరువాత సాయంత్రం పలు రకాల పుష్పాలతో అభిషేకం చేశారు. రాత్రి స్వామి వారికి అర్చకులు ఏకాంతసేవను నిర్వహించారు. భక్తులకు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.



ఏకాంతసేవ నిర్వహిస్తున్న అర్చకులు

ముత్యాలమ్మకు ఉయ్యాల సేవ

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో అమ్మవారిని ఊరేగించిన అనంతరం ఊంజల సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ ఇంద్రసేనమ్మ, మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ సింహాద్రి మనోహర్ పాల్గొన్నారు.



ముత్యాలమ్మకు ఊంజలసేవ నిర్వహిస్తున్న అర్చకులు

జూడో అసోసియేషన్ సభ్యుడికి సన్మానం



రమేష్‌నాయుడును సత్కరిస్తున్న శ్రీనగర్ కాలనీ వాసులు

సూళ్లూరుపేట: రాష్ట్ర స్థాయి జూడో అసోసియేషన్ ఎన్నికల్లో రాయపు రమేష్‌నాయుడు ఆ క్రీడా సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా స్థానిక శ్రీనగర్ కాలనీవాసులు యశోద రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వద్ద మంగళవారం సన్మానసభను ఏర్పాటు చేసి రమేష్‌నాయుడును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన జూడో క్రీడను చిన్న చిన్న పట్టణాలకు సైతం తీసుకురావాలని ఏపీ జూడో చైర్మన్‌గా నాగూరయ్యను, సభ్యుడిగా తనను ఎంపిక చేశారని అన్నారు. అందుకే ఈ ప్రాంతంలోని జిల్లా పరిషత్ హైస్కూల్స్, ప్రైవేట్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో కూడా శిక్షకులను ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. జూడో క్రీడ పట్ల యువత కూడా తెలుసుకుని శిక్షణకు రావాలని ఆయన కోరారు. కాలనీ వాసులు పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేనాటి జనార్దన్ రెడ్డి, దువ్వూరు సుబ్రమణ్యంరెడ్డి, పల్లేటి బాలాజీ, ఎంవీ రమణయ్య, ఉమా శంకర్‌రాజు, పర్వతరెడ్డి మునిహరిరెడ్డి పాల్గొన్నారు.



నేడు ఏజెంట్లతో సమీక్ష

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం వెంకటగిరిలోని ఆయన నివాసంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని నేదురుమల్లి కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. జూన్ 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి ఏజెంట్లతో సమీక్షించనున్నట్లు తెలిపారు. ఏజెంట్ల విధులు, కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నాయి.

ఉచిత కంటి వైద్యశిబిరం నేడు

వెంకటగిరిరూరల్: స్థానిక బంగారుపేట బీసీ కాలనీ సమీపంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం శ్రీనివాసన్ సేవాసంస్థ, శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు శ్రీనివాసన్ సేవాసంస్థ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారిని పరీక్షల ద్వారా ఎంపిక చేసి ఉచిత కంటి ఆపరేషన్‌కు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

కండలేరులో 6.669 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.669 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన ఈసందర్భంగా పేర్కొన్నారు.





















